


# రమణయ్యగారి తోట

ఇంద్రగంటి శ్రీకాంత శర్మ

మారంపల్లి రమణయ్య, వసంతలీల మీద మోజు పడకుంటే, ఆయన గురించి ఇవాళ చెప్పుకోవలసిన అవసరం ఉండేది కాదు.

రమణయ్య కథ ఇవాళ నిన్నా జరిగింది కాదు. అసలలాంటి మనిషి పుట్టడం సరే, ఎలా డెబ్బై ఏళ్లు బతికి వెళ్లిపోయాడో! అందరికీ ఆశ్చర్యమే. చదువా? అంతంతమాత్రం. వంశమందామా? వంటలు చేసి బతుకు వెళ్లదీసే బ్రాహ్మణ కుటుంబం. అదనపు వసతి ఏమంటే పూటకు ఆరుశేర్ల పాలిచ్చే గౌడ గేదె ఆస్తి చూద్దామా? తాతలనాటి పాత పెంకుటిల్లు. అయితేనేం, దాదాపు వెయ్యి గజాల పైచిలుకు ఆవరణ! అంతపెద్ద దొడ్డిలో ఓ పక్క గడ్డివాము. దానిమీదకి బారలు చాచుకుంటూ పాకిన ఆనప్పాదు. నాలుగు కొబ్బరిచెట్లు, జుత్తు విరబోసుకున్న అంబశక్తిలాంటి కరివేప చెట్టు. ఇహ పాదులు, రకరకాల కూరగాయల మొక్కలు గురించి చెప్పనే అక్కర్లేదు.

రమణయ్య తండ్రి సీతప్పగారు ఎడంచేత్తో ఏ విత్తనం పారేసినా మొక్కై ముద్దొస్తుందని ఆ పరగణాల్లో వాడుక. సీతప్పగారి హయాంలో బియ్యం పప్పుఉప్పులు కూడా కొనే అవసరం లేక పోయేదట! వైదికంలో పేరు పడి, ముక్కారు ముద్దినుసులూ ఇంటికి వచ్చిపడేవట. సీతప్పకి ఇద్దరాడపిల్లల తరువాత మగపిందె రమణయ్య. గారానికేం లోటు జరగలేదు గాని, అటు హైస్కూలు చదువూ అబ్బలేదు. ఇటు కులవృత్తి వైదికమూ అంటలేదు. సీతప్ప ఓ వేదాంతి. బెంగ పెట్టుకోదలచలేదు. కష్టపడి సుఖపడే యిళ్లలో, ఇద్దరికూతుళ్లకీ పెళ్లిళ్లు జరిపించి పంపేశాడు. భార్య గౌరీలక్ష్మి యేడిస్తే ''మొగవెధవ. బ్రాహ్మడు, యాయవరం చేసుకునేనా బతుకుతాడు. ఎంతకని యేడుస్తాం?'' అని ఓదార్పుగా విసుక్కున్నాడు సీతప్ప.

పెద్దవయస్సులో, సీతప్ప మరింక వైదిక కార్యాలు చేయించలేక పోయాడు. పోనీ, రమణయ్యకి 'అపరం' నేర్పించి అటు అపరకర్మల వైపు తోసేద్దామని చివరి ప్రయత్నం కూడా చేశాడు. అదీ కుదిరింది కాదు.

అయితే రమణయ్య ఒక కొత్త వృత్తిలో ఆసక్తి కనబరిచాడు. మేనమామ జోగిశాస్త్రి చెయ్యి తిరిగిన వంట బ్రాహ్మడు. ఆయన్ని పట్టుకున్నాడు. జోగిశాస్త్రి, పెళ్లి వంటకి దిగాడూ అంటే, ఆపరణాలలో పిలుపందుకున్న ఎవరూ భోజనం వదులుకొనేవారు కాదని ప్రతీతి.

జోగిశాస్త్రి 'వంట బ్రాహ్మణీకం' అంటే ఫుల్ ఆర్కెస్ట్రా బ్యాండు మేళం లెక్క. దిగారంటే కక్కుర్తి వ్యవహారాలు లేవు. ఆయన 'టీమ్'ని భరించడమంటే, ఏ శుభకార్యం చేసే గృహస్థు అయినా ఒకటికి రెండుసార్లు ఆలోచించుకో వలసిందే.

జోగిశాస్త్రి టీమ్‌లో రమణయ్య ఒక ఆకర్షణగా అనతి కాలంలోనే మారిపోయాడు.

ఒకటి, రమణయ్య నోరు విప్పకపోతే ఆ స్ఫురద్రూపం చూసి, ఎవరైనా 'ఘనపాఠి' అనుకోవచ్చు. నోరు విప్పాడో, ఆ మాటల ధోరణి తట్టుకోవడం కష్టం. మచ్చుకి చెప్పాలంటే రెండు సందర్భాలు చెప్పాలి.

ఒకసారి పెళ్లి వంటకి వెళ్లి, గాడిపొయ్య దగ్గర కూర్చుని ఒక జూనియర్‌ని ఇలా ఆదేశించాడు. ''ఒరేయ్ డింగరీ, ఆ కంద దుంపల్ని చిన్న ముక్కలు చెయ్యకు. తొక్కతీసేసి, నాలుగు పచ్చాలు చేసేసి, గుండిగలో ఉడక బెట్టేసి వార్చేసి తాటాకు చాపమీదికి వం చెయ్యి. చింతపేడు తీసుకు చితక్కొట్టెయ్యి. లేహ్యామైపోతుంది. దాని మీద పోపు తగిలించి నిమ్మ రసం ఓ జల్లు కురిపించు, తీసి వడ్డించు! తిన్నవాడు స్పృహ తప్పిపోవాలి'' మరో సందర్భంలో కార్తీక సమారాధన వంటకి వెళ్లాడు. దోస కాయలు ఊరగాయకోసం తరుగుతున్న లక్ష్మీనరసమ్మతో: ''నరుసూ, దోసావకాయకి ప్రాణం 'ఆవ'. నూనె – పప్పునూనె దభాయించాలి. దోసావకాయ తిన్నవాడికి ఆవఘాటుకి ముక్కూ మొహం ఏకమైపోవాలి'' అన్నాడు.

తరిమి తరిమి వడ్డిస్తాడు. ఎవణ్ణో రెచ్చగొట్టి పంక్తిలో పద్యమో శ్లోకమో చదివిస్తాడు. మీరూ చదవాలి అని ఎవరైనా ముదలకిస్తే ''స్టొన్ బాగా లేదు'' అనేసి నవ్విస్తాడు.

సీతప్ప పోయేనాటికి రమణయ్య సొంత 'టీమ్' కట్టేశాడు. జోగిశాస్త్రి పెద్ద వాడైపోవడంతో 'అసిస్టెంట్' హోదాకి దిగిపోయి, మేనల్లుడి అభివృద్ధినే కోరాడు.

సీతప్ప వెళ్లిపోయాడన్న వెలితితో 'కోరా' పంచె ముసుగుతో ముసిలి తల్లీ, అంతే ముసిలి ఇల్లూ, రమణయ్యకి మిగిలాయి.

ఇదంతా రమణయ్య కథలో ఒక భాగం మాత్రమే!

రమణయ్యకి పెళ్లి కాలేదు.

వంట బ్రాహ్మడికి పిల్ల నెవడిస్తాడు? జోగిశాస్త్రి ఉంటే ఇచ్చేవాడే. అతడికిద్దరూ కొడుకులే! ఇద్దరూ బ్యాంకి ఉద్యోగస్తులే! వాళ్ల పెళ్లిళ్ల నాటికి రమణయ్య 'టీమే' వంట.

రమణయ్య తనకి పెళ్లి కానందుకు విచారించక పోగా, సంతోషించాడు.

ఎందుకంటే;

ఒకసారి కళ్లేపల్లికి వంటకి వెళ్లినప్పుడు ఒక మేజువాణీ బృందంలో వసంత లీల పరిచయమయ్యింది. 'చలాకితార' అన్నట్టుంది. మెల్లగా ఊరు


## H.I.V / ఎయిడ్స్‌కి మందు ఉందని తెలుసా..?

భారతదేశంలోని ఆయుర్వేద అథారిటేటివ్ సంస్థ C.C.R.A.S సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆయుర్వేద & సిద్ధా వారి నుండి 29-05-2002 న 400 మంది H.I.V/ ఎయిడ్స్ రోగులకు చికిత్స చేసి సైంటిఫికల్‌గా H.I.V/ఎయిడ్స్ బర్నింగ్ ప్రాబ్లమ్ పారద్రోలినట్లుగా గుర్తింపు పొందిన డా॥ పి.ఎస్.వి. సత్యనారాయణ గారిని కలిసి మీ H.I.V / ఎయిడ్స్ వ్యాధిని తగ్గించుకొని ఆనందంగా జీవించండి. మా మందులు వాడిన15 రోజులలోనే మంచి ఆకలి, నిద్రను పొంది ముఖము కళ వచ్చి, క్రమేణా వైరల్ చనిపోవుచూ CD4 పెరుగుచుండుట వలన మా కండీషన్స్ పాటించుచున్నవారు 4 నెలల వైద్యంతో రక్షింపబడుచున్నారు. మరియు సంతానలేమి, ఆస్థమా, ఎలర్జీలు, క్యాన్సర్, మూర్ఛ లివర్, చర్మవ్యాధులు, సోరియాసిస్, కీళ్ల నొప్పులు, అల్సర్, ఉన్నవారు నివారణ కొరకు, హెపటైటిస్-బి, హెర్బిస్ వారు నెగెటివ్ కొరకు సంప్రదించండి.

**జి.పి. ఇన్‌స్టిట్యూట్ (హాస్పిటల్)** కన్సల్టేషన్ ఫీజు లేదు

అడ్రస్ : ప్లాట్ నెం.9, శ్రీ వేంకటేశ్వర స్వామి టెంపుల్ స్ట్రీట్, మెయిన్ రోడ్ నుండి 4వ బిల్డింగ్, చిక్కడపల్లి, హైదరాబాద్ - 20.

**Ph: 040 - 66615411, 27605827, cell : 9849007228**



మా కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు



**Akanksha®**

CATERERS *Always with you*



LION A. VENUMADHAV, Ph : 9848019654, 9246557777, HYDERABAD

గురించి వాకబు చేశాడు.

మన గోదావరి జిల్లానే!

ఆనంద పడిపోయాడు.

ఆనాటి నుంచి రమణయ్య కథ పెద్దమలుపే తిరిగింది. ఎందుకు తిరిగింది?

ఇక్కడే వసంతలీల గురించి చెప్పాలి.

***

వసంతలీల! మరీ అందమైంది కాదు. యౌవనపు మెరుపు, సొగసైన పెద్దకళ్లు, ప్రతిదానికీ ముందుగా సంశయించే మనస్సు, ఎక్కువ చొరవ, చనువు తీసుకునే స్వభావం కాదు. ఎవరైనా తక్కువ చేస్తారనో, అవమానిస్తారనో భయం. పౌరుషం జాస్తి. తనకి నచ్చకపోతే ఎంతటి వాళ్లనైనా తిరస్కరించే పొగరు. తల్లీ, ఇతర (మేళంలో) ఆడపిల్లలూ ఉన్నంత విసురుగా ఉండదు. ఆ ఉండక పోవడమే వసంతలీలలో ఆకర్షణ.

సాధారణంగా అటువంటి పిల్లలకి ఆ యిళ్లలో పెళ్లిళ్లు చేస్తారు. వసంతలీల తల్లిమాత్రం పస్తాయించింది. మిగతా పిల్లలంత తెల్లగా ఉండక పోవచ్చు; అయితే యీ పిల్లలో ఏదో ఆకర్షించే గుణం వుందని ఆమె పసికట్టింది. వృత్తిలోకి దింపాలని గట్టిగా అనుకోలేదు గాని వసంతలీలని 'ఉంచుకో దలిచిన మగాడు' దొరక్కపోడు అనుకుంది.

కళ్లేపల్లిలో స్ఫురద్రూపి రమణయ్య, వసంతలీలని ప్రత్యేకంగా భోజనాల దగ్గర ఎంచుకుని మోహ పడడం గమనించింది. మొదట 'సద్బ్రాహ్మడు' అనుకుందిగాని, 'వంటబ్రాహ్మడ'ని తెలియగానే మనస్సు విరిగి పోయింది. ముందు ''మా వూరు దయచేయండి'' అంటూ ఆహ్వానిద్దామనుకుంది గాని, తరువాత ముఖం తిప్పేసుకుంది.

వసంతలీలకి మాత్రం రమణయ్యలో హుషారు నచ్చింది. 'బాపనోడు తమాషాగా ఉన్నా' డనుకుంది. అంతే! ఇంటికొచ్చినా, మనస్సులో అతని బొమ్మ చెరిగిపోలేదు. క్షణంసేపు ''అలాంటి మొగుడుంటేనా!' అనిపించి, తనకి తను సోమిదేవమ్మలా, 'బొమ్మ' కనిపించి పైకి నవ్వేసింది.

''మీ ఊరు రానా?'' అన్నాడు రమణయ్య మెల్లగా, తనూ తెలియకుండానే నవ్వుతూ మంచి నీళ్ల వడ్డిస్తూ–

''బయవాఁ? రాండి'' అంది వసంతలీల కళ్లెత్తి చూస్తూ.

రమణయ్య ఆ క్షణంలో పంక్తినంతా కలయ చూశాడు. ఎవడి తిండి ఘోషలో వాడున్నాడు. అతను మరో పంక్తిలోకి వెళ్లిపోయాడు.

తమ ఊరికి ప్రయాణమౌతూ తల్లికి రమణయ్య మాట చెప్పింది వసంతలీల.

''ఎంతకూ?'' అంటూ ఆమె కనుబొమ్మలు ముడిచి సాగదీసింది.

''ఎంతకేంటి? అందరూ ఎందుకో, అందుకే'' అని ఆ పిల్ల తిరగేసింది.

''ఆ పిలక పంతులు?''

''పిలిచా''.

''సెబాసు''

***

గట్టిగా వారం తిరక్కుండానే రమణయ్య నూరు నంబరు నూలు పంచె మీద, పల్చని 'కోరా' లాల్చీ తొడుక్కుని వసంతలీల యింటి మెట్లెక్కాడు.

ఇల్లు బాగుంది. చక్కని పెంకుటిల్లు. నల్లని అరుగులు. ఆవరణలో గుత్తంగా ఒక పొగడ చెట్టు. అరుగుమీద ఓ పక్కగా కవాచీ బల్లమీద ధాన్యం బస్తాలు. పక్కనే పడక కుర్చీలో చుట్టకాలుస్తూ ముసలాయన.

తటపటాయిస్తూ మెట్ల మీదే ఆగాడు రమణయ్య. ఈ పడక్కుర్చీ మనిషి, కునుకుతున్నాడు. సాయంకాలం సూర్యుడు పడమటికి తిరిగాడు.

ఇంతలో లోపలి హాల్లో ఉయ్యాల బల్లమీద ఊగే అమ్మాయి కిటికీలోంచి చూసి నవ్వుతూ బయటికొచ్చింది.

''ఓ రాండి పంతులుగారూ'' అంది.

పడక్కుర్చీ మనిషి ఉలికిపడి కళ్లు తెరిచి, చుట్ట సరిచేసుకుంటూ బయటికి వెళ్లాడు.

రమణయ్య లోపలికివెళ్లి ఉయ్యాల బల్లమీద కూర్చున్నాడు. మరి నాలుగు కుర్చీలున్నా.

***

''ఎవరూ?'' అంటూ లోపల్నించి వచ్చేతల్లికి ఎదురు వెళ్లి ''పంతులొచ్చాడు. పిలకలేదు'' కిసుక్కున నవ్వింది రాధిక.

''ఆఁ!'' అంది తల్లి.

రమణయ్యని చూసింది. ఇప్పుడు సద్బ్రాహ్మడే కనపడ్డాడు. వంట బ్రాహ్మడు కాడు. కంటికింపుగా ఉన్నాడు.

''అయ్యా, నమస్కారం. ఇదేనా రావటం?'' అంది, వృత్తివల్ల అబ్బిన వినయంతో.

''ఇప్పుడే మీతో మాట్టాడాలని వచ్చాను''.

''నా తోనా, లీలతోనా?''

''ఇద్దరితోనూ!''

''ఏవిఁటో!''

''లీలని కూడా పిలు''

వసంతలీల వచ్చింది.

రమణయ్య ఇప్పుడు హుషారుగా కంటె గంభీరంగా వున్నాడు. ఆమె కంటికి అందంగా కూడా అనిపించాడు.

రాధిక మంచినీళ్ల గ్లాసు అందించింది. తాగి, గ్లాసుపక్కన పెట్టాడు.

''చెప్పండి''

''డొంక తిరుగుళ్లు లేవు. లీలకోసం వచ్చాను''

''ఉంటారా?''

''ఉండను. తీసుకు వెడతాను''

''అదేంటి?''

''పూర్తిగా చెప్పాలికదా! నాకొక పెద్దతోట ఆవరణ, ఇల్లు ఉన్నాయి. వివాహం కాలేదు. చేసుకునే ఉద్దేశమూ లేదు. నేను బ్రాహ్మణ్ణి అయినా, బ్రాహ్మలు నాకు పిల్లనివ్వలేదు. జానేదేవ్! నేను వసంతలీలను నా భార్యగా తీసుకు వెళ్లాలని కోరిక. మీకూ నచ్చితేనే!''

వసంతలీల తల్లి కంగారు పడలేదు. చాలా స్తిమితంగా అంది. ''పెళ్లి చేసుకుని, దీన్ని మీ వంటల్లోకి దించుతారు. అవునా?''

''కాదు; వసంతలీలను తీసుకువెడితే వంటలు మానేస్తాను''

''మరి భోజనం ఎలాగ?'' అన్నట్టు సంజ్ఞ చేసింది.

''మా పెరటి తోట నిండా ఇంకా కూరలు పండించి అమ్ముతాను. కూరల వర్తకులంతా నాకు తెలుసు''

''అంతవరకూ....?''

''డబ్బుంది''

''ఎంత?''


''చాలినంత''

''గడుసువాళ్లే! మా ఆడాళ్లకి ఎంత సొమ్ము చాలదు''

''అదేం లేదు'' అంది చటుక్కున వసంతలీల

తల్లి చురుక్కున చూసింది.

కూతురు తలదించుకుంది.



''ఏం లీలా, నీకు నాతో రావడం ఇష్టమేనా?'' అన్నాడు రమణయ్య. వెంటనే తల్లి అందుకుంది.

''అంత సొతంత్రవా?''

''ఎవరికి? అడగడానికి నాకా? చెప్పడానికి తనకా – ఉండ కూడనిది?''

''ఇద్దరికీనయ్యా, లేదు! చెప్పాల్సింది నేను. ఒక సంగతయ్యా, ఇందాకట్నించి చూస్తన్నా, తీసుకెళ్తా అంటున్నారుగాని పెళ్లి చేసుకుంటాననరేం?''

''ఇప్పుడూ ఇందాకటి మాటే! భార్యగా తీసుకు వెళ్తానంటున్నాను''

''మీ వాళ్లు ఒప్పుకోక పోతే!''

''నా కెవరూ లేరు. మా అమ్మకి నేనెంత చెపితే అంత!''

''భోగం కోడల్ని రానిస్తుందో?''

''మొదటి మాట నేనను, కోడలైతే రానిస్తుంది''

ఇప్పుడు తల్లి, వసంతలీల వైపు తిరిగింది.

''అదంటే లీలా! నీ కిష్టమేఁనా! అంటే.. పెళ్లాంగా''

వసంతలీల రమణయ్య కేసి చూసింది. రమణయ్య ఆమె కళ్లలోకే చూస్తున్నాడు.

''పెళ్లాంగానే యిష్టం'' అంది వసంతలీల.

ఆమె తల్లి ఒక్కక్షణం మౌనంగానే వుంది.

చివరికి అంది.

''అయ్యా ఒక్కమాట. నన్నుంచుకుని ఇన్నేళ్లూ పోషణచేసినాయన ఒక పంజాబీ ఆయన. పేరు ఖన్నా. జితేందర్ ఖన్నా. ఆయన చెప్పాడొకసారి. ఆ దేశంలో ఎవరైనా సరదాపడి ఒక 'బాయి' దగ్గర్నుంచి పిల్లని ఉంచు కోడానికి తీసుకు పోదలిస్తే, ఒక ప్రశ్న అడుగుతారట ఆచారంగా...''

''ఏ మనీ?''

''పులిని ఎవరూ పెంచుకు భరించలేరు. ఈ భోగం పిల్లా అంతే! భరిస్తావా? అని. అప్పటికీ సరసుడు భయపడకుండా ఉంటే, అప్పుడిస్తారట....''

నవ్వింది వసంతలీల తల్లి.

''నన్నూ అడుగుతున్నావా?''

''అనే కదా....''

రమణయ్య కూడా నవ్వేడు.

''నేను పులికోసం రాలేదు. పిల్ల కోసమూ రాలేదు. పెళ్లాం కోసం వచ్చాను''

వెంటనే ''నేను వెడతాను'' అంది వసంతలీల.

తల్లి ప్రసన్నంగా చూసింది.

రాధికని పంచాంగం తెమ్మంది. ముహూర్తం చూడమంది. రమణయ్య చూశాడు.

''ఎల్లుండి''

''ఖర్చవుతుంది''

''సిద్ధం''

''శుభం''

***

అదిగో అలాగ రమణయ్య వసంతలీల ధర్మమా అని ఓ ఇంటి వాడయ్యాడు.

ఆ తరవాత చెప్పుకోదగిన ఘోర ఘటనలేవీ జరగలేదు.

రమణయ్య పెంకుటింటి పెణక తిరగవేయించాడు. వెయ్యి గజాల ఫైలుకు దొడ్డి అంతా పువ్వులు, కూరగాయల తోట చేసేశాడు.

నవ నవలాడే కూరలకీ,

ఘుమఘుమలాడే పూలకీ,

రమణయ్యగారి తోట కేంద్రమైంది. వసంతలీల రాకతో చెట్లు చిగిర్చాయి. రమణయ్య జీవితం పచ్చదనంతో పరిమళించింది.

ఒకే లోటు; పదిహేనేళ్లు గడిచినా వాళ్లకి పిల్లల్లేరు. రమణయ్య తల్లి కాలం చేసింది.

వసంతలీల ప్రతిచెట్టు కాయనీ, పండునీ, తనబిడ్డే అన్నంతగా సాకుతోంది.

రమణయ్య ఇప్పుడు వంట బ్రాహ్మడూ కాదు; వంటరి బ్రాహ్మడు కాదూ. వయిదీకి కాదు. వ్యాపారస్థుడు.

తోట వసంతలీలతో మాట్లాడుతుంది. కష్టంతో చినచెట్లు ముఖం ముడుచుకుంటాయి. మెల్లగా దువ్వితే పూలమొక్కలు కిల కిల నవ్వుతాయి. పాదుల్లోకి నీరు పెడుతూంటే, పాదాలకి నమస్కరించిన కుర్రాళ్లని పెద్దవాళ్లు ఆశీర్వదించినట్టు అని ఆమె తల మీదకి తీగలాకుల చేతులు చాపుతాయి. ఏ 'దోహదాలూ' అక్కర్లేకుండానూ, ఏ జగదీశ్ చంద్రబోసులూ చెప్పకుండానూ, ఆ మొక్కలన్నింటి ప్రాణాలూ ఎప్పుడెప్పుడు సుఖంగా సంతోషంగా ఉండగలవో వసంతలీలకి తెలుసు. ఆ తోటకి రమణయ్య విత్తనాలు నాటే తండ్రి అయితే, వసంతలీల వాటి ఆట పాటల్ని సాకే తల్లి.

మరో విచిత్రం! వాళ్ల తోట పండాలంటూ ఏ రసాయనాలూ వాడరు. ఏ పురుగుల్నీ చంపరు. అవి సహజంగానే పెరుగుతాయి. రమణయ్య నేర్చుకున్నాడు; ఈ వాతావరణంలో, మట్టిలో నశింపజేసేవీ, రక్షించేవీ సూక్ష్మప్రాణులు వాటంతటవే పుడతాయి.

# దీపావళి రుబాయిలు




దీనుల కళ్లల్లో దీపావళి చూడాలి
చీకటి బతుకుల్లో వెలుగు రవ్వలాడాలి
కడుపు నిండా తిండితినే కాలమొస్తే కాకరాలా!
ఉన్న వాళ్లు లేని వాళ్లు ఒక్కచోట కూడాలి

***

నేల మీద రవి బింబం తిరుగుతున్న విష్ణుచక్రం
అంతరించిపోయింది అంధకార నక్రం
రోజంతా చీకట్లో రోదించకు అజంతా!
చిరుదివ్వెలు వెలిగిస్తే అవుతుందిక సక్రం

***

చీకటిలో చిన్న ఆశ దీప్తివంతమవుతుంది
సకాలంలో సహాయం సంతృప్తిని ఇస్తుంది
జాబిల్లిని దీపంగా వెలిగిస్తే జావేద్!
తూర్పువైపు నీ యాత్ర స్ఫూర్తివంతమవుతుంది

***

సంపాదన ఉన్నప్పుడే భద్రంగా దాచుకో
సంతానం తిట్టకుండా సంసారం నోచుకో
ఉన్నదంత తిని తాగితే ఏమున్నది నోములా!
కాటి వైపు హాయిగా కాళ్లు రెండు చాచుకో

***

విలపించే వాళ్లతో వినోదాలు వద్దు
కలహించే నోళ్లతో వివాదాలు కద్దు
ఎంతనోటికంతమాట ఏమంటావ్ దేవీ!
మౌనంగా ఉండటమే మర్యాదకు హద్దు

***

అంతా తలరాత అనడమింక మానుకో
సొంతంగా కష్టపడి తాడైనా పేనుకో
ఒంటె లాంటి పయనాన్ని వద్దనకోయ్ ఓలేటీ!
శ్రమ వల్లే ముడుతుంది ఏదో ఒక కానుకో.

***

చిచ్చుబుడ్లు మతాబులు చిన్నబోతున్నాయి
తమను కొనేవారులేరని ఖిన్నమవుతున్నాయి
ఏ నాటికి దారిద్ర్యం తీరుతుందో దయానంద్!
అంతదాక గుడిసెలన్ని ఛిన్నాభిన్నమవుతున్నాయి.

***

జీవితాన్ని ప్రతిక్షణం జీవించండి
బతకడమే ప్రాణంగా భావించండి
చావు కబురు ఎదురైనా బెదరవద్దు సీతా!
ఆనందాన్నే అంతిమ యాత్రగా సాగించండి

***

కొవ్వొత్తిలా చీకటి తోవలో కరిగిపో
త్యాగమూర్తివై దేశసేవలో ఒరిగిపో
ఎంతకాలం బతికామని కాదుకదా సదాశివ!
కొంత సమయమైనా గంధపు చెక్కలా అరిగిపో

***

పిల్లదాని చేతుల్లో పెద్ద చిచ్చుబుడ్లు
విస్తుబోయి చూస్తున్నాయి కొట్టంలో ఎడ్లు
పడుచువాళ్ల సంబరాలు చూశావా చంద్రా!
వద్దంటే పడుతున్నాయి నోటి నిండ లడ్లు

***

(*నక్రం–మొసలి)

–ఎండ్లూరి సుధాకర్
92466 50771

అవి తినేవి తింటే, వాటిని తినేవీ ఉంటాయి. 'వృక్షాయుర్వేదం' అనే పుస్తకం సంపాదించి రక రకాల కషాయాలూ, నేలలో పుట్టినవే ఎరువులూ, మొక్కలకి వేస్తూంటాడు. తోట అందరికీ బహువచనమే మోగాని, వాళ్లిద్దరికీ ఏకవచనమే! కాయలు కోసినా, పువ్వులు తుంపినా, గెలలు దింపినా, పురుడు పోసినట్టే సున్నితం. అంతా సున్నితం.

బేరగాళ్లకీ వీళ్లభాష అలవాటైపోయింది. కొనుగోళ్లన్నీ పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్నట్టే! అక్కడ ప్రాణులు, ప్రాణులతో మాట్లాడుతారు. వానొచ్చినా, వరదొచ్చినా, చీడ తగిలినా, పీడతగిలినా, మనిషికి లాగే మొక్కకీ సేవ!

ఆవు పాలు చేపినట్టు, వసంతలీల చెయ్యి తాకితే చాలు, చెట్టూ చెట్టూ కల్పవృక్షమై పోతుంది. పారిజాతమై పోతుంది. సంతానం, మందారం, హరిచందనం అయిపోతాయి.

రమణయ్య తల్లి బతికున్నంతకాలం తన వంట తనే చేసుకునేది. వసంత లీల ఎప్పుడూ అభ్యంతరం పెట్టలేదు. సీతప్ప చేసిన అలవాటు వల్ల బతికున్నంత కాలం చెట్ల మొదళ్లలోనే గడిపింది. పాదులు చేసేది. గడ్డి తీసి నేల శుభ్రం చేసేది. బాదం ఆకులతో విస్తళ్లు కుట్టేది. వేసవి వస్తే మల్లె చెట్ల ఆకులు దూసి, వాటికి నీళ్లు పోసేది. చివరికి, కొబ్బరిచెట్టు ఎండు మట్ట మీద పడి, పెద్దవయసులో జడుసుకుని, ప్రాణాలు విడిచింది. చెట్టుకిందనే!

ఒక యేటికొకయేడు ఇలాగే పెరిగి తోటని పెంచారు. వాళ్లూ జీవితంలో పెరిగారు.

కాలం ఎల్లప్పుడూ ఒక్కలాగుండదు కద! వసంతలీల మాత్రం ఎప్పుడన్నా తల్లిని చూడడానికి వెళ్లి వచ్చేది. రమణయ్య తోటకి కాపలా తను లేక పోతే వసంతలీల కాపలా.

గౌడ గేదె పోయిందికాని, దాని దూడ పెరిగి దానంతగానూ ఆసరా అయింది. సూరయ్య దాన్ని బయటకు తీసుకువెళ్లి దగ్గర్లోనే వున్న పెద్ద కాలవలో కడిగి తెస్తుంటాడు. వాడే పాలు తీస్తాడు. అమ్ముకొస్తాడు.

కాలం గురించి అనుకున్నాం కదా! నాగరికత మారిపోయింది. ఊళ్లో మనుషుల చర్యలన్నిటా వేగం పెరిగింది. రద్దీ పెరిగింది. అందుకనుగుణంగా పాతరోడ్లు విస్తరించాయి. కొత్తరోడ్లు, వంతెనలు అవతరించాయి. జనం ప్రవర్తన, భాషతీరు మారిపోయాయి.

రమణయ్య తోట ఇల్లుకి, కొంచెం ఎగువన వున్న పెద్దకాలవ మీద వంతెన లేచింది. దాంతో కార్లు, బస్సులు, ఆటోల రద్దీతో ఆ వీధంతా రణగొణధ్వని పెరిగింది. ఆ వీధికి ఎక్కడలేని గిరాకీ పెరిగింది. 'రియల్ ఎస్టేట్ బూమ్' పేరిట ఎక్కడ పడితే అక్కడ షాపింగ్ కాంప్లెక్సులు, అపార్టుమెంట్లు సందడి మొదలైంది. చాలామంది దృష్టి రమణయ్య తోట మీద పడింది. ఒకప్పుడా తోట యిల్లు ఓ మూలగా ఉండేది. వంతెన లేవడంతో ప్రముఖంగా కనపడుతోంది.

ఎవరిదాకానో యెందుకు? రమణయ్య స్నేహితుడు, హోల్‌సేల్ వ్యాపారి పాతూరి సుబ్బారాయుడే సౌమ్యంగా అడిగేశాడు.

'పంతులూ నీకు మన పొలం దగ్గరే, కుదిమట్టంగా రెండు కుంచాల భూమిస్తా. ఈ యిల్లు నాకొదిలెయ్యి. తోటేసుకో! పెట్టుబడి నేనే యిస్తాలే''

ముందు, యీ రణగొణధ్వని నించి తప్పించుకోలేక, రమణయ్య మెత్త బడబోతే వసంతలీల పడనివ్వలేదు. 'పంతులు మంచోడే! ఆ ముండే పడనివ్వలే'దని సుబ్బారాయుడు రుంజుకున్నాడు.

ఇక్కడే రమణయ్య కథ మరో మలుపు తిరిగింది. ఒకానొక సాయంకాలం వేళ వసంతలీల తల్లి రమణయ్య ఇంటి ముందు కారు దిగింది. ఆమె వెంట, ఒక డబ్బునునుపు తేరిన, కించిత్ బట్టతల మనిషి దిగాడు. అతను జితేందర్ ఖన్నా పెద్దకొడుకు. పేరున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి. వసంతలీలతో రమణయ్యకి చెప్పించి ఆ ఇంటితో సహా తోట కొనేసేటట్టూ, అపార్టుమెంటొకటీ, ముప్ఫై లక్షల రొక్కం ఇచ్చేటట్టూ, ఒప్పందం కోసం వచ్చారిద్దరూ. అంతా వింది వసంతలీల. రమణయ్య, పోనీ ఉండడానికో యిల్లూ, డబ్బూ వస్తాయి కదా అని క్షణం సేపు తటపటాయించాడు. వసంతలీల మాత్రం ఖండితంగా చెప్పేసింది అమ్మబోమని. తల్లి నచ్చజెప్పబోయింది. రమణయ్య కూడా 'ససేమిరా' అనేశాడు.

ఖన్నా కొడుకు ఆశవదులుకోకుండా ''పోనీండి. మరోసారి ఆలోచించండి. ఒక వేళ అమ్మదలిస్తే మాత్రం కబురు చెయ్యండి. మనం మనం కావలసిన వాళ్లం'' అని లేచాడు.

***

మరో యేడాది గడిచేసరికి పరిస్థితి తిరగబడి, రమణయ్య దారుణంగా తుపాను దెబ్బతిన్నాడు. తోటంతా సర్వనాశనమై పోయింది. మళ్లీ కోలుకోవాలంటే రెండేళ్లూ, మూడేళ్లూ చాలవు. ఈనాటి లెక్కల్లో కనీసం నాలుగైదు లక్షల ఖర్చు.

రమణయ్యకి నిజానికా యిల్లు వదలాలని లేదు; కాని, తప్పేటట్టు లేదు.

రమణయ్యగారి తోటంటే ఆ వూళ్లో ఒక కొండ గుర్తు. కూరల కోసం తపించే వాళ్లకి కేంద్రం. కార్తీక సమారాధనలకి నెలవు. ఆ వీధిలో ఏ యింట తోరణం కట్టాలన్నా, రమణయ్య తోటనించే మామిడి మండలు రావాలి. ఉగాది వస్తే వేప పువ్వు, మామిడి కాయలు కావాలి. భోజనానికి 'కవిలె' అరిటాకులు కావాలంటే, రమణయ్యే పంపాలి.

ఇప్పుడా తోట, జబ్బుతో మంచానపడి పోయింది.

సరిగ్గా రెండు నెల్లాగి ఖన్నాకొడుకు కబురు చేశాడు.

ఈసారి రమణయ్య వసంతలీలను ఒప్పించడానికి తీవ్రప్రయత్నం చేశాడు. వినివిని వసంతలీల ఒక్కటే మాటంది.

''ఖన్నా, తండ్రిని వృద్ధాశ్రమంలో చేర్చి, డబ్బిచ్చి ప్రేమ చూపిస్తున్నాడు. ఇది తోట. మన ఇల్లు. మన పిల్ల. దీనికే వృద్ధాశ్రమం వద్దు. లేదు కూడా. దీనిని కాపాడాలి. మనమే వదిలేస్తే....'' కంట తడిపెట్టింది.

''తేరుకోగలమా?'' అన్నాడు రమణయ్య సంశయంగా.

''తోట తేరుకోవాలంటే, మనం కోలుకోవాలి. కోరుకోవాలి'' అంది నిర్లిప్తంగా వసంతలీల.

''అవునంతేలే. సంపాదించింది చాలు'' వసంతలీల నవ్వుతూ అంది.

''పులి పిల్ల మాకు బరువూ కాదూ; భయమూ లేదు అని ఖన్నాకు కబురు చెయ్యండి''

రమణయ్య కృతజ్ఞతగా వసంత లీలను కౌగిలించుకున్నాడు.

✻

రచయిత సెల్: **98480 78079**

